బొబ్బిలి చెరువు వద్ద వ్యర్థాలను తొలగింపజేస్తున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న

స్వచ్ఛతను పాటిద్దాం..

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 19: ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించడంతో పాటు పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకుందామని షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని బొబ్బిలి చెరువు వద్ద చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలను గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకన్నతో కలిసి పరిశీలించారు. గణేశ్ నిమజ్జనం చేశాక ఏర్పడిన వ్యర్థాలను కార్మికులతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి చెత్త సేకరణ వాహన దారులకు ఇవ్వాలన్నారు. అదే విధంగా పట్టణంలోని పలు దుకాణాలను కమిషనర్ వెంకన్న తనిఖీ చేసి నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ ఆర్పీలు మున్సిపాలిటీలోని 21వ వార్డులో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించడంతో పాటు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాయకుడు నందకిశోర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

పెద్దఅంబర్‌పేట : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం శ్రేయాస్ ఇంజినీరింగ్ కాలేజీలో కమిషనర్ ఎస్.రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు.

స్వచ్ఛతపై అవగాహన

చేవెళ్ల రూరల్ : స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమాన్ని సక్రమంగా చేపట్టాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీలు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ వీధుల్లో ఫాగింగ్, రోడ్లు, మురుగునీటి కాలువలు శుభ్రం చేయడం, వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లడం, మొక్కల సంరక్షణకు చర్యలు వంటి వాటిపై చర్చించామని ఎంపీడీవో తెలిపారు. సమావేశంలో ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు, ఏపీవో, ఏపీఎం పాల్గొన్నారు.

శంకర్‌పల్లి తెలంగాణ మాడల్ స్కూల్‌లో..

శంకర్‌పల్లిలోని తెలంగాణ మాడల్ స్కూల్‌లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, మానవహారం చేసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మాడల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ అనంతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి తదితరులు

ఆదిబట్ల, సెప్టెంబర్ 19: మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్ 8వ వార్డులో మున్సిపల్ జనరల్ నిధుల నుంచి రూ.6లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి రానున్న రోజుల్లో ప్రభుత్వం ద్వారా అత్యధికంగా నిధులు తీసుకువచ్చి మరింత అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మహేందర్, కమిషనర్ బాలకృష్ణ, గ్రామస్తులు విష్ణు, రవీందర్‌ముదిరాజ్, భిక్షపతి, శ్రీకాంత్‌గౌడ్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది నిర్బంధ పాలన

చలో ప్రజాభవన్ ముట్టడి సందర్భంగా నిరసన తెలిపిన బీఆర్ఎస్ నేతలు, రైతులు ప్రభుత్వం రుణమాఫీ చేయాలని డిమాండ్ హౌస్ అరెస్ట్‌లు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించిన పోలీసులు

ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తూరు, సెప్టెంబర్ 19: ప్రజాభవన్ ముట్టడికి బీఆర్ఎస్ అధిష్టానం పిలుపునిచ్చిన నేపథ్యంలో కొత్తూరు బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులను పోలీసులు ముందస్తుగా గురువారం అరెస్ట్ చేశారు. ముఖ్య నాయకులు, కార్యకర్తల ఇంటికి వెళ్లి వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు దేవేందర్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదని నిర్బంధ పాలన అని విమర్శించారు. అరెస్టయివారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్, కౌన్సిలర్లు నర్సింహాగౌడ్, సోమ్లానాయక్ మాజీ ఎంపీటీసీ రాజేందర్‌గౌడ్, విష్ణుమూర్తి, రవినాయక్, నాగరాజుగౌడ్ ఉన్నారు.

షాద్‌నగర్‌టౌన్ : రైతురుణ మాఫీ అమలుకాని రైతులు చేపట్టిన చలో ప్రజాభవన్ కార్యక్రమంలో భాగంగా కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేటలో పోలీసులు గురువారం హౌస్ అరెస్టులు చేశారు. అదే విధంగా కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో బీఆర్ఎస్ నాయకులను షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచికత్తుపై విడిచిపెట్టారు.

చేవెళ్ల రూరల్ : చేవెళ్ల నుంచి ప్రజా భవన్‌ను ముట్టడించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ ఆధ్వర్యంలో ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దొళ్ల ప్రభాకర్, మాజీ ఎంపీపీ మంగళి బాల్‌రాజ్, మాజీ ఎంపీటీసీ ఎల్లన్న ఉన్నారు.

ఆమనగల్లు : చలో ప్రజాభవన్ కార్యక్రమానికి మద్దతుగా వెళ్తున్న బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో మాజీ ఎంపీటీసీ కుమార్, నాయకులు సయ్యద్ ఖలీల్, రమేశ్‌నాయక్, శ్రీనూనాయక్, పంతూనాయక్ ఉన్నారు.

కడ్తాల్ : ప్రజాభవన్ ముట్టడి సందర్భంగా కడ్తాల్ మండలంలోని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేశ్‌నాయక్, నాయకులు పంతూనాయక్, చందు ఉన్నారు.

రైతుల పక్షాన బీఆర్ఎస్

షాద్‌నగర్‌టౌన్ : రైతుల పక్షాన బీఆర్ఎస్ ముందుండి పోరాడుతుందని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. రైతులు చేపట్టిన చలో ప్రజాభవన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ను పోలీసులు ముందుస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి షరతు ల్లేకుండా రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారని, రుణమాఫీకి అన్ని అర్హతలు ఉన్నా చాలామంది రైతులకు ఇంకా రుణమాఫీ కాలేదన్నారు. రైతులకు వెంటనే రుణమాఫీ అయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు.

నందిగామ : ప్రజాపాలన కాదు.. ఇది ప్రజా నిర్బంధ పాలన అని, ప్రతిపక్షం గొంతు నొక్కినా ప్రజా సమస్యల పరిష్కారానికి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాలు ఆపలేదని మాజీ జడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. గురువారం ప్రజాభవన్ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ నాయకులను నందిగామ పోలీసులు ముందుస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ విఠల్, మామిడిపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ సురేశ్, నాయకుడు నర్సింహ ఉన్నారు.

షాద్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన కొందుర్గు పోలీసులు

కొత్తూరు : బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసిన కొత్తూరు పోలీసులు

షాద్‌నగర్‌లో మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

కడ్తాల్ : బీఆర్ఎస్ మండల నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు

నందిగామలో బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

సాగు నీరందిస్తాం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబర్ 19 : కల్వకుర్తి ఎత్తిపోతల పథకం(కేఎల్ఐ) డీ-82 కాల్వ పనులను పదిహేను రోజుల్లో పూర్తి చేసి నాగిళ్ల చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాల్వ నిర్మాణం లో భూములు కోల్పోయిన రైతులకు దసరా లోపు పరిహారం చెల్లిస్తామన్నారు. గురువారం ఆమనగల్లు, మాడ్గుల మండలాల్లో డీ-82 కాల్వ పనులను సంబంధి త శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కేఎల్ఐ డీ-82 కాల్వ పనుల్లో జరుగుతున్న అలసత్వంపై అధికారులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆమన గల్లు మండలంలోని సింగంపల్లి వద్ద కాల్వ పనులకు మిషన్ భగీరథ పైపులైన్ అడ్డు రావడంతో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా మూడు రోజుల్లో ఆ పనులను పూర్తి చేయా లని అధికారులను ఆదేశించారు. అనంతరం సింగంపల్లి గ్రామస్తులు ట్రిపుల్ ఆర్ లో మా భూములు పోకుండా చూడాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేయగా.. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు ఎస్ఈ ఏఎస్ఎన్ రెడ్డి, ఈఈ శ్రీకాంత్, డీఈ దేవానంద్, ఏఈ రాఘవేంద్ర, బాధిత రైతులు వెంకటేశ్వర్లు, మల్లేశ్, నాయకులు జగన్, కృష్ణానాయక్, మహేశ్, శ్రీశైలం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దైవభక్తిని అలవర్చుకోవాలి

కొత్తూరు, సెప్టెంబర్ 19 : ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని మాజీ ఎమ్మె ల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండలంలోని పెంజర్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్ద ఆయన గురువారం ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దేవేందర్‌యాదవ్, పెంటనోళ్ల యాదగిరి, నందిగామ సుధాకర్, దేశాల జైపాల్, ఎర్రోళ్ల జగన్, మాజీ సర్పంచ్ బాల్‌రాజ్, పోచయ్య, రాజు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మొయినాబాద్, సెప్టెంబర్ 19 : మండలంలోని తోలుకట్టా గ్రామంలోని ప్రభుత్వ భూమి 141 సర్వేనంబర్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన బేస్‌మెట్లను గురువారం అధికారులు కూల్చివేసి..ఇది ప్రభుత్వ భూమి అని తెలిపేలా బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుజిత్ రెడ్డి, సిబ్బంది భాస్కర్, మహేందర్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 19 : ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణాల యజమానులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని చేవెళ్ల ఏడీఏ సురేశ్‌బాబు అన్నారు. గురువారం చేవెళ్లలోని రైతువేదికలో చేవెళ్లకు సంబంధించిన ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణాల యజమానులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన ధరలకే విత్తనాలు, ఎరువులను విక్రయించాలని, అమ్మకాల వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో ఎంట్రీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి శంకర్‌లాల్, మండల వ్యవసాయ విస్తరాధికారులు పాల్గొన్నారు.

పంట పాలంలో క్షుద్రపూజల కలకలం..

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 19 : మండలంలోని అంతారం గ్రామంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. గ్రామానికి చెందిన ఆవుల అనంతయ్య తన పొలంలో చామంతి పంట వేశాడు. ఈనెల 18న పౌర్ణమి కావడంతో పసుపు, కుంకుమ కలిపిన అన్నం, పిండితో తయారు చేసిన ఓ బొమ్మ, దానికి రెండు చిన్న కట్టెపుల్లలు అమర్చి ఓ ప్లాస్టిక్ ప్లేటులో వాటిని వేసి గుర్తు తెలియని వ్యక్తులు చామంతి పొలంలో పాడేశా రు. ఉదయం పొలానికి వెళ్లిన అనంతయ్య దానిని చూసి భయంతో పోలీసులు, గ్రామస్తులకు సమాచారమందించాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు అక్కడున్న ప్లాస్టిక్ ప్లేటును పారవేశారు. ఇలాంటి వాటికి భయపడొద్దని, మూఢ నమ్మకాలను నమ్మొద్దని సూచించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 19 : చేవెళ్లలోని తెలంగాణ మాడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేసి ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం మాడల్ స్కూల్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన చేవెళ్ల మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ టీనా వతి, స్థానిక నాయకులు యాలాల మహేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజాఆగిరెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణనాథుడి లడ్డూ కైవసం

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 19: మున్సిపాలిటీలోని కుంట్లూరు గణేశ్‌నగర్ కాలనీలో వినాయకుడి లడ్డూను రూ.1.53 లక్షలకు పడమటి శ్రీనివాస్‌రెడ్డి కైవసం చేసుకున్నారు. తట్టిఅన్నారంలో లడ్డూను రూ.68 వేలకు కుకుట్లపల్లి నరేందర్ దక్కించుకున్నారు.

మొయినాబాద్ : మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దారెడ్డి దుర్గా యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూను దారెడ్డి చంద్రారెడ్డి రూ.3.21 లక్షలకు కైవసం చేసుకున్నాడు. అదే విధంగా వినాయకుడికి నైవేద్యంగా పెట్టే పండ్లను వేలం పాటలో అవుసుల రామాచారి రూ.61వేలకు దక్కించుకున్నాడు.

గణనాథుడికి పూజలు

కడ్తాల్, సెప్టెంబర్ 19: మండల కేంద్రంలోని స్కైబ్లూ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద గురువారం సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి పూజలు చేశారు. అనంతరం ఉప్పనమోని జంగయ్య, శాంతమ్మ దంపతులు అన్నదాన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు, హోమాలు

మొయినాబాద్, సెప్టెంబర్ 19 : మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నది. గురువారం పూర్ణాహుతి విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం మండలాధ్యక్షుడు రాంపల్లి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు, హోమాలు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం, చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్, ఆ పార్టీ మండలాధ్యక్షుడు మాణెయ్య, బీజేపీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాజేశ్‌గౌడ్, రాజు, విశ్వకర్మ సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహాచారి, కోశాధికారి కృష్ణమాచారి, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

29న తుది ఓటరు జాబితా

ఈ నెల 21వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ అన్ని పార్టీల ముఖ్య నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించిన అధికారులు

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 19 : గ్రామ పంచాయతీ ఓటర్ల ముసాయిదాపై అభ్యంతరాలుంటే తెలుపాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య అన్నారు. గురువారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ.. ఓటర్ల ముసాయిదా జాబితా తయారీ కోసం సహకరించాలని, పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాను ఈనెల 13వ తేదీన ప్రచురించడం జరిగిందని తెలిపారు. అభ్యంతరాలపై ఈ నెల 21వ తేదీ వరకు అభ్యంతరాలపై దరఖాస్తుల స్వీకరిస్తామని తెలిపారు. ఈ నెల 29వ తేదీన ఫైనల్ ఓటరు జాబితాను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ సురేందర్, ఎంపీవో, ఎంఈవో అక్బర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో..

షాబాద్ : పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే తమకు తెలియజేయాలని ఎంపీడీవో అపర్ణ అన్నారు. గురువారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఓటర్ల జాబితాను తయారు చేసి ఆయా గ్రామ పంచాయతీల్లో ఈ నెల 13వ తేదీన ప్రచురించడం జరిగిందని తెలిపారు. ఇందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21వ తేదీలోపు తమకు తెలపాలని సూచించారు. 28వ తేదీన తుదిజాబితాను ప్రచురించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధు, ఎంపీవో శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మల్లేశ్, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో సవరణలు చేసుకోండి

యాచారం : వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాలో సవరణలు ఉంటే సవరించుకోవాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సాధారణ ఎన్నికలు ముసాయిదా(డ్రాఫ్ట్) ఓటరు జాబితా తయారీపై ఎంపీడీవో అధ్యక్షతన రాజకీయ పార్టీల అధ్యక్షులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఓటరు జాబితాపై అధికారులు, అఖిలపక్షం నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో సవరణలు, అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21 సాయంత్రం 5గంటలలోపు మండల పరిషత్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో ఎంపీవో శ్రీలత, సూపరింటెండెంట్ శైలజ, పలు పార్టీల అధ్యక్షులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలియజేయాలి

ఇబ్రహీంపట్నంరూరల్ : పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే తెలపాలని ఇబ్రహీంపట్నం ఎంపీడీవో వెంకటమ్మ అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా రాజకీయపార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో వెంకటమ్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాను ఈ నెల 13న ప్రచురించినట్లు తెలిపారు. జాబితాపై అభ్యంతరాలుంటే ఈనెల 21వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్పతినాయక్‌తో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు రవిందర్‌రెడ్డి, సీపీఎం నాయకులు బుగ్గరాములు, జగన్, సీపీఐ నాయకులు నర్సింహతో పాటు ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌రూరల్ : రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఈ నెల 13న ఫరూఖ్‌నగర్ మండలంలోని పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయంలో వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించినట్లు మండల అభివృద్ధి అధికారి జయంత్‌రెడ్డి తెలిపారు. ఈ జాబితాలో సవరణలు, అభ్యంతరాలపై బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ తెలుగుదేశం, సీపీఎం, బహుజనసమాజ్ తదితర పార్టీ మండల నాయకులతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ పార్టీల నాయకుల నుంచి అభ్యంతరాలను స్వీకరించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, బాలవర్దన్, వివిధ పార్టీల నుంచి నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బీష్వరామకృష్ణ, వెంకటేశ్, వెంకటేశ్వరరెడ్డి, చందర్‌బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కడ్తాల్ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు, నాయకులతో అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో ఓటరు లిస్ట్‌లను సవరించాలని కోరుతూ నాయకులు అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. అదే విధంగా ఓటరు జాబితా సవరణ తేదీని పొడిగించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ అధికారులను కోరారు. సమావేశంలో ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీవో విజయ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు పరమేశ్, బిచ్చానాయక్, మన్యానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ పాల్గొన్నారు.

నందిగామ : ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుమతి, తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీవోలు ఓటరు జాబితా అభ్యంతరాలపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 21వ తేదీ లోపు గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయంలో జాబితా సవరణపై అభ్యంతరాలు సమర్పించాలని అధికారులు తెలిపారు.

మొయినాబాద్ : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సంధ్య ఆధ్వర్యంలో అధికారులు అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష నేతలు ఓటరు జాబితాలో ఉన్న లోపాలు, తప్పులను ఎత్తి చూపారు. వాటిని వెంటనే సవరించి ఓటరు తుది జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. అఖిల పక్ష నేతలు తెలిపిన అభ్యంతరాలను నివేదిక తయారు చేసి ఎంపీడీవో సంధ్య ఉన్నతాధికారులకు పంపారు. సమావేశంలో ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, నేతలు కోంపల్లి అనంతరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాణెయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంచాల : మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో ఓటరు జాబితా సవరణపై అభ్యంతరాల స్వీకరణ కోసం మండల పంచాయతీ అధికారి ఉమారాణి సమావేశం నిర్వహించారు. సమావేశంలో సూపరింటెండెంట్ అజీమ్, వివిధ పార్టీల నాయకులు బహదూర్, రాంరెడ్డి, జగన్, భాషయ్య, జంగయ్యగౌడ్, రాజు పాల్గొన్నారు.

కొత్తూరు : ఓటర్ల సవరణపై రాజకీయ పార్టీలో అధ్యక్షులతో గురువారం ఎంపీడీవో సుమతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 21లోపు గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాల్లో సమర్పించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీవో విజయలక్ష్మి, రాజకీయ పార్టీల అధ్యక్షులు పాల్గొన్నారు.

యాచారం : గ్రామపంచాయతీ వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాలో అపకతవకలున్నాయని వెంటనే సవరించాలని